సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 4 । జనవరి । 2025



వికసించిన కిరణ పుష్పం

మంచు పొరలను చీల్చుకుంటూ లేలేత సూర్యకిరణాలు చెట్టు కొమ్మల మధ్యగుండా పుడమిని తాకేవేళ సాక్షాత్కరించిన కిరణ పుష్ప ఆకారం చూపరులకు కనువిందు కలిగించింది. గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ ఘాట్ రోడ్డులో శుక్రవారం ఉదయం ప్రయాణించేవారిని కాసేపు మురిపించి.. మైమరిపించింది.
– గుమ్మలక్ష్మీపురం

న్యూస్‌రీల్

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- జలాశయాల నుంచి నీటిని తరలించేలా ప్రణాళిక

సాక్షి, పార్వతీపురం మన్యం: రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ప్రజలకు రక్షిత నీటి సరఫరా కోసం పలు జలాశయాలను గుర్తించారు. జలాశయాల నీటిని పథకానికి అనుసంధానించే ప్రాజెక్టుకు సిద్ధమవుతున్నారు. జిల్లా పరిధిలోని తోటపల్లి, పెద్దగెడ్డ, మడ్డువలస రిజర్వాయర్లను గుర్తించారు. జిల్లాకు సంబంధించి పలు రిజర్వాయర్ల నుంచి నీటిని తీసుకుని 1,937 గ్రామాలకు వాటర్ గ్రిడ్ ద్వారా నీటిని అనుసంధానించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు రూ.1,432 కోట్ల వరకు వ్యయమవుతుందని భావిస్తున్నారు. వేసవిలోనూ కుళాయిల ద్వారా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా నదుల నుంచి నీటిని సేకరించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

నేటి నుంచి కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



డి.మంజుల వీణ

పార్వతీపురంటౌన్: జూనియర్ కళాశాల విద్యార్థులకు 4వ తేదీ నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డి.మంజుల వీణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి శనివారం సాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పథకాన్ని ప్రారంభిస్తారని ఆమె తెలిపారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ కూడా కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చదువుతున్న 5,905 మంది విద్యార్థులు మధ్యాహ్నం భోజన పథకంలో ప్రయోజనం పొందనున్నారని చెప్పారు.

డీఎంహెచ్‌ఓగా భాస్కరరావు బాధ్యతల స్వీకరణ



భాస్కరరావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిగా డాక్టర్ ఎస్.భాస్కరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఈయన విజయనగరం డీఎంహెచ్‌ఓగా పనిచేశారు. జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది ఆయనకు ఆరోగ్య కార్యాలయంలో పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని, జిల్లాకు మంచి గుర్తింపు తీసుకు వచ్చేలా కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో డీఐఓ డా.నారాయణరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.పద్మావతి, ప్రోగ్రాం అధికారులు డా.రఘు, డా.వినోద్, డా.విజయమోహన్, డా.శ్రీధర్, ఆఫీస్ సూపరింటెండెంట్ కామేశ్వరరావు, ఆరోగ్య కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా పోలీస్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు



పరుగు పందెంను పర్యవేక్షిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: స్టైపెండరీ మహిళా పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు పీఎంటీ, పీఈటీ పరీక్షల ప్రక్రియను ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం ప్రారంభించారు. 550 మందికి 314 మహిళా అభ్యర్థులు హాజరయ్యారు. దేహదారుఢ్య పరీక్షలను ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు, పలువురు సీఐలు, ఆర్‌ఐలు, పోలీస్ అధికారులు పర్యవేక్షించారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

విజయనగరం అర్బన్: వివిధ ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందేందుకు నిరుద్యోగ మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎస్‌బీఆర్‌సీఎస్‌డీ అండ్ ఈడబ్ల్యూ జిల్లా మేనేజర్ పి.విమల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూయింగ్ మెషిన్ ఆపరేటర్ (45 రోజులు), మగ్గం వర్క్ (30 రోజులు), బేకరీ ప్రొడెక్ట్స్ (30 రోజులు) కోర్సులకు 8వ తరగతి విద్యార్హత ఉన్నవారు అర్హులన్నారు. అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ (60 రోజులు) ఉపాధి కోర్సుకు 10 తరగతి కనీస విద్యార్హతగా పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 10వ తేదీలోపు స్థానిక మహిళా ప్రాంగణానికి అందజేయాలని సూచించారు.

మొక్కుబడి సదస్సులు

- నామమాత్రంగా రెవెన్యూ సదస్సులు
- మళ్లీ అధికారుల చుట్టూ అర్జీదారుల ప్రదక్షిణ

సాక్షి, పార్వతీపురం మన్యం:

'సాలూరు మండలం తోనాం గ్రామానికి చెందిన పూజారి జగదీశ్వరరావు.. తమ ప్రాంతంలో భూసర్వే చేపట్టలేదని, అధికారులు స్పందించి రీసర్వే చేయాలని విజ్ఞప్తి చేశారు.'

- పాచిపెంట మండలం గడివలసకు చెందిన లెంక దాలినాయుడు.. కర్రివలస గ్రామం సర్వే నంబర్ 189–2లో తనకు చెందిన 1.26 ఎకరాల స్థలం వేరే పేరున 1బీ ఇచ్చారని, దాన్ని సవరించి తన భూమి ఇప్పించాలని కోరారు.
- గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర గ్రామానికి చెందిన ఎం.పున్నాలమ్మ ఖాతా నంబర్ 591 నుంచి గ్రామ రెవెన్యూ దాఖలలో ఉన్న భూమిని జిరాయితీ భూమిగా మార్చాలని దరఖాస్తు అందజేశారు.
- మక్కువ మండలం దుగ్గేరు గ్రామానికి చెందిన ఎం.లక్ష్మణకు సంబంధించిన భూమిని వేరే వారు ఆక్రమించుకున్నారని, ప్రభుత్వం వారు సర్వే చేసి తన భూమిని అప్పగించాలని కోరారు.
- మక్కువ మండలం కాశీపట్నం గ్రామానికి చెందిన పి.మరియమ్మ 1970 సంవత్సరం నుంచి సాగు చేసుకున్న భూమికి పాస్ పుస్తకం మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు.

ఈ సమస్యలన్నీ రెవెన్యూపరమైనవే.. కొద్ది రోజులుగా పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో అధికారులకు వచ్చిన వినతులే. 'మీ సొంత గ్రామంలోనే.. మీ సమక్షంలోనే ఇటువంటి సమస్యలన్నీ పరిష్కరిస్తాం. భూ సంబంధిత సమస్యల కోసమే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. ఎవరూ జిల్లా కేంద్రం వరకూ వచ్చి అధికారులకు వినతులు ఇవ్వాల్సిన అవసరం లేదు.' అంటూ రెవెన్యూ సదస్సులు సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నారు. ఓ వైపు సదస్సులు జరుగుతున్నా.. మరో వైపు భూ సంబంధిత అంశాలపై అధికారులకు యథాతథంగా వినతి పత్రాలు వస్తుండడం.. సదస్సుల తీరుపై సందేహాలు రేకెత్తిస్తున్నాయి.



కొంకడి వరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ బాల

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

గరుగుబిల్లి: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని గరుగుబిల్లి మండల తహశీల్దార్ పి.బాల అన్నారు. కొంకడి వరంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. జేఎల్‌పీ, అడంగల్, 1బీలపై పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. ఇనామ్ భూముల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో క్రయవిక్రయాలు చేసుకోలేకపోతున్నామని రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.అప్పలనాయుడు, హెచ్‌డీటీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రచారానికే పరిమితం

రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వం.. చివరికి వాటిని మొక్కుబడి తంతుగా మార్చేసింది. జిల్లాలో ప్రజల నుంచి వేలల్లో ఫిర్యాదులు అందుతున్నా.. పరిష్కారం అంతంత మాత్రంగానే ఉంటోంది. దీంతో బాధితులు ఉసూరుమంటూ తిరిగి కలెక్టరేట్‌లో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలకు అవే సమస్యలతో పోటెత్తుతున్నారు. 900కు పైగా గ్రామాల్లో సదస్సులు నిర్వహించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు సుమారు 713 గ్రామాల్లో పూర్తి చేశారు. ప్రజల నుంచి 4,666 అర్జీలు వచ్చాయి. వాస్తవానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన భూ సంస్కరణలను నిలిపివేసిన కూటమి ప్రభుత్వం.. వాటిపై విషం చిమ్మేందుకే ఈ సదస్సులను చేపట్టిందన్న విమర్శలు ఉన్నాయి. ల్యాండ్ టైట్లింగ్ చట్టం, భూముల రీసర్వే, అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కుల కల్పన, చుక్కల భూములకు పరిష్కారం లాంటి అన్ని భూ సంబంధిత అంశాలనూ వివాదమయం చేసి, తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని భావించింది. ప్రధానంగా రీసర్వే అనేది పెద్ద తప్పుగా చిత్రీకరించే ప్రయత్నం చేయాలని అనుకుంది. క్షేత్రస్థాయిలో ఫిర్యాదులు ఈ అంశమై ఆశించిన స్థాయిలో రాకపోవడం.. ముందుగా నిర్దేశించిన షెడ్యూల్ కావడంతో సదస్సులను మొక్కుబడిగా కానిస్తోంది.

ప్రజల నుంచి స్పందన కరువు..

జిల్లాలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ రెవెన్యూ సదస్సులను తూతూమంత్రంగా నిర్వహిస్తుండడంతో స్థానికుల భాగస్వామ్యం పెద్దగా ఉండడం లేదు. మొదట్లో ప్రజల నుంచి స్పందన ఉన్నా.. పరిష్కారం మీద నమ్మకం కలగకపోవడంతో ప్రస్తుతం 10, 20 మంది కూడా రావడం లేదు. ఈ సభలను అధికారులు కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో ఎలాగోలా నిర్వహించి మమ అనిపిస్తున్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి: కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సదస్సులు, పల్లెనిద్ర, ప్రజా సమస్యల పరిష్కార వేదిక తదితర అంశాలపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సమీక్షించారు. పీఎంఏవై 2.0లో గృహ అవసరాలు ఉన్నవారిని గుర్తించి మంజూరు చేయాలన్నారు. ఫిబ్రవరి నెలాఖరుకు 5వేల గృహాలు పూర్తి చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో చేపడుతున్న పీఎం జన్‌మాన్ పనులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ నెల 7 వరకు ఎస్సీ కుల ఆడిట్‌లో వచ్చిన అభ్యంతరాలను స్వీకరించాలని కోరారు. పల్లెనిద్ర, గ్రామ దర్శిని కార్యక్రమాల్లో గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం శనివారం నుంచి జిల్లాలోని జూనియర్ కళాశాలలో అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పలు శాఖాధికారులు పాల్గొన్నారు.

బాసంగిలో గజరాజులు



బాసంగి ముంపుడులో ఉన్న గజరాజులు

జియ్యమ్మవలస: మండలంలోని నిర్వాసిత గ్రామమైన బాసంగి ముంపు ప్రాంతంలో ఏనుగులు గురువారం దర్శనమిచ్చాయి. సాయంత్రం వేళ గదబవలస వద్ద ఉన్న అరటితోటలోకి జారుకున్నాయి. రాత్రి వేళ గ్రామంలోకి చొచ్చుకువచ్చే ప్రమాదం ఉందని రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అటవీశాఖ సిబ్బంది వాటిని తరలించే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆశ్రమ పాఠశాలలో పల్లె నిద్ర



విద్యార్థుల అభ్యసన తీరును అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఆహార భద్రతా అధికారి రామయ్య

జియ్యమ్మవలస: మండలంలోని వనజ గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం రాత్రి జిల్లా ఆహార భద్రతా అధికారి రామయ్య పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. రికార్డులు, పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయాన్ని పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరీక్షించారు. గురువారం ఉదయం వనజ గ్రామాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం సరఫరాపై ఆరా తీశారు. మలేరియా, ఎనీమియా కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీ గుమ్మడికి ఒడిశాలో భలే డిమాండ్



సీతంపేట మార్కెట్‌కు గిరిజనులు తెచ్చిన గుమ్మడికాయలు

- పండగ సీజన్‌లో వారపు సంతల్లో విక్రయం
- సైజును బట్టి రూ.40 వరకు అమ్మకం
- 200 ఎకరాల్లో పంట సాగు

సీతంపేట: ఏ శుభకార్యానికైనా గుమ్మడి తప్పనిసరి. సీతంపేట ఏజెన్సీలో గుమ్మడి కాయల సీజన్ ఆరంభమైంది. సంక్రాంతి పండగకు తప్పనిసరిగా దీని అవసరం ఉండడంతో ఇప్పుడిప్పుడే ఏజెన్సీ వారపు సంతల్లో గిరిజనులు విక్రయిస్తున్నారు. ఒడిశాలో ఎక్కువ డిమాండ్ ఉండడంతో అక్కడి వ్యాపారులు వచ్చి గుమ్మడి కాయలు కొనుగోలు చేస్తున్నారు. ఏజెన్సీలో సుమారు 200 ఎకరాల్లో గుమ్మడి పంటను సాగుచేశామని, ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని, ఒక్కోకాయ/పండు సైజును బట్టి రూ.40 నుంచి రూ.50 పలుకుతోందని గిరిజన రైతులు చెబుతున్నారు. సీతంపేట, మర్రిపాడు, కుశిమి, పొల్లలో జరిగే వారపు సంతలకు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశాకు చెందిన వ్యాపారులు వచ్చి గుమ్మడి పంటను కొనుగోలుచేస్తున్నారన్నారు.

ప్రస్తుతానికి ధర గిట్టుబాటవుతోంది



గుమ్మడి కాయలను కొండలపై నుంచి మోసుకుంటూ సంతలకు తరలిస్తున్నారు. సీజన్ ఆరంభంలో ధరలు బాగున్నాయి. చివరి వరకు ఇవే ధరలు ఉంటే రైతుకు లాభమే. సీజన్ మధ్యలో వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతుకు ధర లేకుండా చేస్తున్నారు.
– ఎస్.జోషి, అడ్డంగి

ఆలోచనలే ఆవిష్కరణలై..

- ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన ప్రాజెక్టులు
- రాష్ట్రస్థాయి పోటీలకు ఐదు ప్రదర్శనలు ఎంపిక
- సైన్స్‌ఫెయిర్‌ను సందర్శించిన కలెక్టర్, డీఈఓ

పార్వతీపురంటౌన్: విద్యార్థులు సృజనకు పదును పెట్టారు. ప్రాజెక్టుల రూపంలో మలిచారు. వాటిని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పార్వతీపురంలోని డీవీఎం స్కూల్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శన పోటీల్లో ప్రదర్శించారు. ప్రాజెక్టుల పనితీరు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను సవివరంగా తెలియజేశారు. వీటిలో ఉత్తమంగా నిలిచిన ఐదు ప్రాజెక్టులను జిల్లా విద్యాశాఖ అధికారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పోటీలను స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రారంభించారు. ముందుగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉండే ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసేందుకు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. రానున్నది సాంకేతిక యుగంగా పేర్కొన్నారు. 15 మండలాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన 45 ప్రాజెక్టులను తిలకించి, పనితీరును తెలుసుకున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి డా.ఎస్.తిరుపతి నాయుడు మాట్లాడుతూ దేశంలోని శాస్త్రవేత్తల జీవిత విశేషాలను విద్యార్థులకు తెలియజేసి, వారిలో స్ఫూర్తిని నింపి తద్వారా వారిని శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే విద్యా వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శనల ఉద్దేశమన్నారు. మండలస్థాయిలో ఎంపిక చేసిన ప్రాజెక్టులను జిల్లా స్థాయిలో ప్రదర్శించినట్టు వెల్లడించారు.

త్వరలో పార్వతీపురంలో ఇన్నోవేషన్ హబ్

నీతి అయోగ్ ప్రకటించిన ర్యాంకింగుల్లో ఆశావాహ (యాస్పిరేషనల్) జిల్లాగా పార్వతీపురం నిలిచినందున రూ.3 కోట్లు నిధులు విడుదలయ్యాయని, ఆ నిధులతో త్వరలో పార్వతీపురంలో ఇన్నోవేషన్ హబ్‌ను నిర్మించనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఫిజిక్స్, మ్యాథ్స్, ప్లానిటోరియం వంటివి ఏర్పాటుచేస్తామని, ఇవి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. సైన్స్ ఫెయిర్‌లో విజేతలుగా నిలిచిన వారికి జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయాధికారి ఆర్.తేజేశ్వరరావు, ఉప విద్యాశాఖాధికారులు డి.రాజ్‌కుమార్, పి.కృష్ణమూర్తి, డీసీసీబీ సెక్రటరీ శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు ఎం.రమాజ్యోతి, పి.దామోదరరావు, కౌన్సిలర్ వెంకటినాయుడు, డీవీఎం పాఠశాల హెచ్‌ఎం గోవిందరావు, ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

- **విద్యార్థి వ్యక్తిగత విభాగం:** టి.చరణ్‌సాయి (9వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, మార్కొండపుట్టి. గైడ్‌టీచర్ టి.పద్మలత (రూమ్ వార్మర్ ప్రాజెక్టు), ఎ.రిషి (9వ తరగతి) జెడ్పీహెచ్‌ఎస్, కంబవలస, గైడ్ టీచర్–ఎ.వెంకటరావు
- **విద్యార్థి గ్రూపు విభాగం:** డి.నితిన్‌కుమార్ (10వ తరగతి), పి.గోవిందరావు (9వ తరగతి) జెడ్పీ హెచ్ స్కూల్, తలవరం, పి.గౌతమ్ (10వ తరగతి), జి.పార్థసారథి (8వ తరగతి), డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం, సీతానగరం
- **టీచర్ వ్యక్తిగత విభాగం:** సీహెచ్ స్వర్ణలత, ఎంపీయూపీ స్కూల్, గోపాలపురం (పాలకొండ) డి. ప్రసన్న కుమార్, జెడ్పీహెచ్‌ఎస్, మామిడిపల్లి (సాలూరు)

పల్లెల్లో జలంలేని జీవనం

- పడకేసిన జల్‌జీవన్ మిషన్ పనులు
- నిధులున్నా ముందుకు సాగని వైనం
- పైప్‌లైన్‌లే తప్ప నీరు సరఫరా కాని దుస్థితి
- ఇంటింటికీ కుళాయిలు హుళక్కే
- మన్యంలో తప్పని తాగునీటి కష్టాలు
- రానున్న వేసవికి పూర్తికావడం కష్టమే!

సీతంపేట:

ఇంటింటికీ తాగునీరు సరఫరాయే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నిధులతో ఏజెన్సీలో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులు ప్రస్తుతం పడకేశాయి. కొన్నిచోట్ల నత్తనడకన సాగుతున్నాయి. వచ్చే వేసవికి కూడా పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో మన్యం వాసులు ఆవేదన చెందుతున్నారు. వేసవిలో బిందెడు నీటి కోసం మైళ్ల కొద్దీ నడక తప్పేలా లేదని బెంగపడుతున్నారు.

నెమ్మదించిన పనులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పాలకొండ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో జేజేఎం పథకం కింద 505 పనులు మంజూరయ్యాయి. రూ.10.77 కోట్ల నిధులు అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. ప్రభుత్వం మారడంతో పనులు నెమ్మదించాయి. ఇప్పటివరకు కేవలం 154 పనులు మాత్రమే పూర్తయ్యాయి. 223 పనులు ప్రోగ్రెస్‌లో ఉన్నట్టు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు చెబుతున్నారు. 128 పనులు ఇంకా ప్రారంభం కావాల్సి ఉంది.

- సీతంపేట ఏజెన్సీలో 326 పనులకు రూ.1659.15 లక్షలు కేటాయించగా గతంలో పూర్తయిన 120 పనులే కనిపిస్తున్నాయి. 112 పనులు వివిధ దశల్లో ఉండగా, 94 చోట్ల పనులు ప్రారంభం కాలేదు.
- పాలకొండలో 48 పనులకు గాను రూ.839.41 నిధులు మంజూరయ్యాయి. వీటిలో 14 పూర్తి చేయగా 21 ప్రోగ్రెస్‌లో ఉండగా, 13 పనులు ప్రారంభం కాలేదు.
- వీరఘట్టంలో 53 పనులకు రూ.773.79 లక్షలు కేటాయించగా 6 పూర్తయ్యాయి. 38 వర్క్ ఇన్ ప్రోగ్రెస్‌లో చూపించారు. మిగతా 9 ప్రారంభించలేదు.
- భామినిలో 78 పనులకు 7506.73 నిధులు మంజూరయ్యాయి. 14 మాత్రమే పూర్తిచేశారు. 52 పనులు జరుగుతున్నాయి. వీటిలో 12 ప్రారంభించలేదు. గ్రామాల్లో వేసిన పైప్‌లైన్‌లు మాత్రమే దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. పనులు పూర్తిచేసేందుకు గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులు చొరవ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది కూడా వేసవిలో తాగునీటి కష్టాలు ఎదుర్కోక తప్పదని గిరిజనులు వాపోతున్నారు.



మోహన్‌కాలనీలో పైప్‌లైన్ వేసిన చుక్క నీరు రాని కుళాయిలు



రంగంవలసలో కలుషిత నీటిని పడుతున్న మహిళ



కంగారుగూడలో పైప్‌లైన్ పరిస్థితి ఇలా..

పైప్‌లైన్‌లే కనిపిస్తున్నాయి



గ్రామాల్లో పైప్‌లైన్‌లే కనిపిస్తున్నాయి. మంచినీరు రావడం లేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా గ్రామమైన మోహన్‌కాలనీలో కూడా అదే పరిస్థితి. ఇంత నిర్లక్ష్యం వహించడం తగదు.
– ఎస్.మంగయ్య, చిన్నబగ్గ ఎంపీటీసీ

పాత పనులు పూర్తి చేసేందుకు చర్యలు

పాత పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ప్రారంభించి, బిల్లులు చెల్లించినవి ఉంటే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వాటిని పూర్తి చేస్తాం. ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం మిగిలిన పనులు చేపడతాం.
– మధుసూదనరావు, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ

పనుల్లో జాప్యం తగదు



గిరిజన గ్రామాలకు తాగునీటి సరఫరాకు గత ప్రభుత్వం కృషిచేసింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిధులు కేటాయించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా పనులపై దృష్టిసారించకపోవడం విచారకరం. ఏజెన్సీ గ్రామాల్లో శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది. అధికారులు స్పందించి పనులు యుద్ధప్రాతిపదికన చేయాలి. రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి. – విశ్వాసరాయి కళావతి, పాలకొండ మాజీ ఎమ్మెల్యే

క్లుప్తంగా

5నుంచి ఎంజేపీ స్కూల్‌లో క్రీడాపోటీలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేబీబీ రావు

నెల్లిమర్ల: ఈనెల 5వతేదీనుంచి ఎంజేపీ గురుకుల బాలికల పాఠశాలలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేబీబీ రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యా సంస్థ,(విజయవాడ) ఆధ్వర్యంలో జోన్-1 ఆటలు పోటీలు ఈనెల 5,6తేదీల్లో నెల్లిమర్ల ఎంజేపీ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అలాగే జోన్-1లో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 14 విద్యాసంస్థలకు చెందిన బాలికలు వాలీబాల్, కబడ్డీ, షటిల్, పరుగుపందెం తదితర విభాగాల్లో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కరాటే పోటీల్లో విజయనగరం క్రీడాకారులకు పతకాలు



కరాటే పోటీల్లో సాధించిన పతకాలతో క్రీడాకారులు

విజయనగరం: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఖరగ్‌పూర్‌లో జరిగిన జపాన్ కెన్యూర్యూ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్-24లో విజయనగరం పట్టణంలోని కొత్త అగ్రహారంలో ఉన్న గురుదత్త పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులకు పతకాలు లభించాయి. ఈ మేరకు కరాటే కోచ్ కె.సంతోష్ కుమార్ శుక్రవారం విడుదల చేసిన ప్రకట నలో విద్యార్థులు పి.హేమంత్ (రెండు బంగారు), కె.శివగణేష్ (ఒక బంగారు, ఒక కాంస్య పతకం), బి.రేశ్వంత్ (కాంస్య) పతకాలతో విజయ భేరి మోగించినట్లు తెలిపారు. కోచ్ సంతోష్ కుమార్‌తో పాటు విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ పద్మ, శంకరరావు తదితరులు అభినందించారు. మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు.

అమ్మవారి హుండీల ఆదాయం రూ.4,47,668



అమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న అధికారులు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో హుండీల ద్వారా రూ.4,47,668 ఆదాయం లభించినట్లు దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి బి.శ్రీనివాస్ తెలిపారు. అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జి.శ్యామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో హుండీల ఆదాయం లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. 2024 సెప్టెంబర్ 9 నుంచి 2025 జనవరి 3 వరకు భక్తులు హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని లెక్కించారు.

125 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

బొబ్బిలి: పట్టణ సమీపంలోని గ్రోత్ సెంటర్ వద్ద 125 మద్యం సీసాలను తరలిస్తున్న గున్నతోట వలసకు చెందిన పప్పల రాధాకృష్ణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు ఏఎస్సై జి.భాస్కర రావు తెలిపారు. పారాది నుంచి గున్నతోట వలస వెళ్తున్న రాధాకృష్ణ వద్ద మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం తరలించామన్నారు.

ఆర్టీసీ బస్సు బోల్తా



ప్రమాదంలో బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

మెంటాడ: మండలంలోని గుర్రమ్మవలస-బుచ్చిరాజుపేట గ్రామాల మధ్య ఆర్టీసీ పల్లె వెలుగు అద్దె బస్సు పొలాల్లో శుక్రవారం బోల్తా పడింది. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి జక్కువ వెళ్తున్న బస్సు ప్రమాదవశాత్తు రెండు గ్రామాల మధ్య బోల్తా పడింది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఆరుగురు ప్రమాణికులు మాత్రమే ఉన్నారు. ప్రయాణికులను సురక్షితంగా స్థానికులు బస్సు అద్దాలు పగులగొట్టి బయటకు తీశారు. ప్రయాణికులు ఆరుగురికి స్వల్ప గాయాలు కావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. గాయపడిన వారిని చల్లపేట పీహెచ్‌సీకి వైద్యం కోసం తరలించారు. ఆంద్ర ఎస్సై కె.సీతారాం సంఘనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

పింఛన్..వంచన..!



రాజాం: ఈ ఫొటోలోని మహిళ పేరు సీరాపు గౌరమ్మ. వంగర మండలం పట్టువర్ధనం గ్రామం. ఈమె భర్త సీరాపు సింహాచలం సరిగ్గా పదినెలల క్రితం మృతిచెందాడు. వితంతు పింఛన్ నిమిత్తం ఆమె అప్పట్లో గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఆరునెలలకు ఒక దఫా కొత్త పింఛన్లు, సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపికచేసి, సకాలంలో అందించేది. కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో పాటు గత ఎనిమిదినెలలుగా కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో ఈమెకు పింఛన్ అందలేదు. దీంతో ఆమె కుటుంబాన్ని నెట్టుకొచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతోంది. మగదిక్కులేని ఈ కుటుంబానికి ఆసరా కల్పించాల్సిన పింఛన్ అందకపోవడం శోచనీయంగా మారింది.



ఈ ఫొటోలోని మహిళ పేరు కొర్ను రాజులమ్మ. రాజాం మండలం నందబలగ రామం. ఆమె భర్త కొర్ను లింగమూర్తి మే నెలలో మృతిచెందాడు. రోజువారీ కష్టంతో లింగమూర్తి కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. ఆయన మరణాంతరం కుటుంబం రోడ్డున పడింది. రాజులమ్మ పింఛన్ కోసం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంది. ఇంతవరకూ పింఛన్ మంజూరు కాలేదు. గతంలో ఠంచన్‌గా ప్రతి ఆరునెలలకు కొత్త లబ్ధిదారులను గుర్తించి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పింఛన్ అందించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనుమరుగైంది.

- కొత్త పింఛన్ల కోసం లబ్ధిదారుల ఎదురుచూపు
- వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు తప్పని ఇబ్బందులు
- గత ఎనిమిదినెలలుగా పింఛన్ మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
- జిల్లా వ్యాప్తంగా 8600కు పైగా దరఖాస్తులు
- ఇటీవల సదరం కేంద్రాల నిలుపుదల
- అడ్రస్‌లేని 50 ఏళ్లకే ఫించన్ పథకం
- బిత్తరపోతున్న లబ్ధిదారులు
- స్పౌజ్‌కోటాలో కేవలం 292 పింఛన్లు మాత్రమే మంజూరు



రాజాంలో ఖాళీగా సదరం కేంద్రం

జిల్లా వ్యాప్తంగా 8వేలకు పైగా దరఖాస్తులు

గత తొమ్మిదినెలల నుంచి జిల్లా వ్యాప్తంగా 8వేలకు పైగా కొత్త పింఛన్లకు లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులు గ్రామ సచివాలయాల వద్ద ఎదురుచూస్తున్నాయి. వితంతు పింఛన్లతో పాటు వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్ నిమిత్తం సచివాలయాలకు దరఖాస్తులు ఇవ్వడమే తప్ప కొత్త పింఛన్ల మంజూరు, పరిశీలన వంటి కార్యక్రమాలు ఇంతవరకూ ప్రారంభం కాలేదు. వీటికి తోడు కొత్తగా నమోదైన కిడ్నీ, లివర్, హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్, డయాలసిస్, సికిల్‌సెల్, ఒంటరి మహిళ, లెప్రసీ, కండరాల బలహీనత వ్యాధిగ్రస్తులు పింఛన్ల నిమిత్తం ఎదురుచూస్తున్నారు వీటితో వచ్చే నగదుతో మందులు కొనుగోలుచేసి, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం సామాజిక పింఛన్ల మంజూరుకు ఎటువంటి కనికరం చూపించకపోవడం శోచనీయం

సదరం మూసివేత

గతంలో సదరం సర్టిఫికెట్ల మంజూరు కేంద్రాలు నిరంతరం పనిచేసేవి. ప్రతి మంగళ, శుక్రవారాల్లో పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సదరం తనిఖీలు చేసేవారు. ప్రమాదాలు, పక్షవాతం బారిన పడి అంగవైకల్యంతో ఇబ్బందిపడేవారికి సదరం కేంద్రాల్లో తనిఖీ అనంతరం సర్టిఫికెట్లు మంజూరయ్యేవి. వారికి సామాజిక పింఛన్లు మంజూరుతో పాటు పలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిచేకూరేది. ఇప్పుడు ఆ పరిస్థితి తలకిందులుగా మారింది. కొంతకాలంగా సదరం స్లాట్ బుకింగ్‌లతో పాటు సర్టిఫికెట్ల మంజూరును కూడా కూటమి ప్రభుత్వం నిలుపుదల చేసేసింది.

అటకెక్కిన 50 ఏళ్లకే పింఛన్

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 50 ఏళ్లు నిండిన వారందరికీ సామాజిక పింఛన్లు ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఇంతవరకూ ఆ పథకం అమలుకాలేదు. 50 ఏళ్లుదాటితే పింఛన్ వస్తుందని ఎదురుచూడడంతోపాటు ఏ క్షణాన్నైనా పింఛన్ మంజూరవుతుందనే ఆశతో పలువురు లబ్ధిదారులు ఇప్పటికే గ్రామ సచివాలయాల్లో కుల, ఆధాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డులతో దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులు కూడా ఆయా గ్రామాల టీడీపీ కార్యకర్తలు కలెక్షన్ చేయగా, ఇంతవరకూ పింఛన్ల మంజూరుకు కనీసం దరఖాస్తులు కూడా తీసుకోకపోవడం కొసమెరుపు.

కేవలం నామినీలకే..

జిల్లాలో 8600 మందికి పైగా కొత్త పింఛన్ దరఖాస్తు దారులు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో కేవలం 292 మందికి మాత్రమే స్పౌజ్(నామినీ) కోటాలో జనవరి నెలలో కొత్త పింఛన్ అందించింది. అవి కూడా జిల్లాలో పలుచోట్ల అర్హులకు అందలేదనే విమర్శలు ఉన్నాయి. కేవలం టీడీపీ అనుకూల వర్గీయులకు మంజూరు కావడం, పలుచోట్ల కొత్తగా పింఛన్ వచ్చినవారిని టీడీపీ కార్యకర్తలు ప్రలోభాలకు గురిచేయడం, ఆయా గ్రామాల్లో గ్రామ సచివాలయ సిబ్బంది ఎటువంటి పదవులు లేని టీడీపీ కార్యకర్తలతో పింఛన్లు పంపిణీచేయడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయంపై రాజాం ఎంపీడీఓ వి. శ్రీనివాసరావు వద్ద సాక్షి ప్రస్తావించగా కొత్త పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియ ఎక్కడా ప్రారంభంకాలేదన్నారు. కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి విధివిధానాలు కూడా ఖరారుకాలేదని వెల్లడించారు.

అంతా బూటకమే



అబద్ధపు హామీలతో కూటమి ప్రభుత్వం గద్దెనెక్కింది. ప్రధానంగా సూపర్ సిక్స్ పథకాలేవీ అమలు కావడంలేదు. వాటి పరిస్థితి పక్కన పెడితే కనీసం పింఛన్ల మంజూరు విషయంలో కూడా ఈ ప్రభుత్వం చొరవచూపకపోవడం శోచనీయం. జిల్లాలో కుప్పలుతెప్పలుగా కొత్త పింఛన్ల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుని సిద్ధంగా ఉన్నారు. ఇంతవరకూ వారికి పింఛన్లు ఇవ్వకపోగా, గత పాత పింఛన్లను కత్తిరించేందుకు కూటమి ఆలోచన చేస్తోంది.

బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎంపీ, విజయనగరం

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి



మహాసభల కరపత్రాలను విడుదలచేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 22వ రాష్ట్ర మహాస భలు ఫిబ్రవరి 6,7,8,9 తేదీలలో శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా జరుగుతున్నాయని, వాటిని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బూర వాసు, కోట అప్పన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక అమర్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం, పాలక పక్షాలు విఫలమయ్యాయని విమర్శించారు. భారతదేశంలో యువకులు పెద్ద ఎత్తున ఉన్నప్పటికీ వారికి కల్పించవలసిన హక్కులను నిర్వీర్యం చేశారని విమర్శించారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగినప్పటికీ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఈ తరుణంలో శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా జరుగుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 22వ మహాసభలలో 6వ తేదీ ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని వారు కోరారు. 7,8 వ తేదీలలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే 1000 మంది ప్రతినిధులతో మూడు రోజులపాటు దేశం, రాష్ట్రంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించుకుని యువతను మమేకం చేసి భవిష్యత్తు ఉద్యమాలకు నాంది పలుకుతామన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఎస్ గౌరీశంకర్, సీహెచ్ వెంకటేష్, ఎం.సుధాకర్, ఎస్.మహేష్ పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



పోలీసు సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురంటౌన్: నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై ఉండే పోలీస్ సిబ్బంది శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ.మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 'పోలీస్ వెల్ఫేర్ డే' (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ముఖ్య ప్రాధాన్యం ఇస్తూ సిబ్బంది వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన పలు సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ గ్రీవెన్స్‌డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ సిబ్బంది పాల్గొని వారికి ఉన్న సమస్యలను ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. పోలీస్ సిబ్బంది విన్నవించుకున్న సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని ఎస్పీ భరోసా కల్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో ఎస్పీ మాట్లాడి, పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీసీ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

పర్యాటకరంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



తాటిపూడి రిజర్వాయర్‌లో పర్యాటక అభివృద్ధిలో భాగంగా సాహస జలక్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గంట్యాడ: పర్యాటకరంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గంట్యాడ మండలంలోని తాటిపూడిలో ఉన్న గొర్రిపాటి బుచ్చిఅప్పారావు జలాశయం వద్ద వాటర్‌స్పోర్ట్స్ సింపల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేసిన అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోటు షికారు ఉంటే పర్యాటకులు ఎక్కువగా వస్తారన్నారు. కోవిడ్ తర్వాత కుటుంబ సభ్యులతో గడపడానికి ఎక్కువ మందికి అసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలసయశస్వి, వాటర్ స్పోర్ట్స్ సీఈఓ పాపారావు, మర్రాపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకంగా ఆలోచించాలి..

భోగాపురం: ప్రతి విద్యార్థి సృజనాత్మకంగా ఆలోచించాలని భీమిలి ఉమెన్ పాలిటెక్నికల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మురళీకృష్ణ, స్కిల్ డవలప్‌మెంట్ జిల్లా అధికారి జి. ప్రశాంత్‌కుమార్ అన్నారు. మండలంలోని కవులవాడ అవంతి పాలిటెక్నికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్. మల్లేశం దొర ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన టెక్ ఉత్సవ్ 2కె25 కనెక్టింగ్ విత్ ఫ్యూచర్ అవగాహన సదస్సును వారు ప్రారంభించారు. ఈ సదస్సుకు ఉత్తరాంధ్ర పరిధిలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొని పలు ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ప్రాథమిక దశలో ఇటువంటి వైజ్ఞానిక సదస్సులు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. పిల్లల్లో ఇమిడి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను ఇటువంటి సదస్సుల ద్వారా వెలికితీయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి. గోవింద్, శెట్టి మహేష్, ఎ.చంద్రశేఖర్, కె.భాస్కరరావు, జి. అశోక్ కుమార్, కె.హేమ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సూర్యఘర్'పై అవగాహన పెంపొందించండి

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూర్యఘర్ పథకం విశిష్టతను ప్రతి ఒక్కరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ కార్యదర్శులకు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో వెల్ఫేర్, ఎడ్యుకేషన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాల వివరాల నమోదును ఈనెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని చెప్పారు. అలాగే సూర్యఘర్ పథకం ఆవశ్యకతను అపార్ట్‌మెంట్ అసోసియేషన్లతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 20వ తేదీలోగా సమావేశాలు పూర్తి చేయాలని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, హాస్పటళ్లు, హోటళ్లు వంటి సంస్థలలో సోలార్ ప్యానళ్ళు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి గృహ సముదాయంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారా, లేదా అన్నది తనిఖీలు నిర్వహించాలన్నారు. త్వరలోనే ఎన్టీఆర్ భరోసా దివ్యాంగ పెన్షన్లను తనిఖీ చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో టీపీఆర్ఓ సింహాచలం పాల్గొన్నారు.

6 నుంచి మెడికల్ పెన్షన్ల రీ వెరిఫికేషన్

- కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: మెడికల్ పెన్షన్ల రీ-వెరిఫికేషన్ ప్రక్రియను ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ తెలిపారు. ఈ ప్రక్రియపై జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, వైద్యాధికారులతో శుక్రవారం సాయంత్రం కలెక్టర్..తన చాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వైద్య పింఛన్లలో పూర్తిగా మంచానికే పరిమితమై పింఛన్ పొందుతున్న వారు 342 మంది ఉన్నారని తొలి విడతలో వీరి పింఛన్లను రీ వెరిఫికేషన్ చేయనున్నట్లు తెలిపారు. తరువాత దశలో మిగిలిన వైద్య పింఛన్లను పరిశీలిస్తారన్నారు. రీ వెరిఫికేషన్‌కు ఇతర జిల్లాల నుంచి 6 బృందాలు వస్తాయని చెప్పారు. ఒక్కో బృందంలో ఒక అర్థోపెడిక్ డాక్టర్, ఒక జనరల్ మెడిసన్ సర్టిఫికెట్, సదరం, ఆధార్ తదితర ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు. వరుసగా మూడు రోజుల పాటు ఈ బృందాలు పర్యటిస్తాయని మూడు రోజుల విరామం తీసుకుంటాయని చెప్పారు. వీరి తనిఖీలకు వీలుగా షెడ్యూల్‌ను రూపొందించాలని ఆదేశించారు. సంక్రాంతి పండగకు ముందే వీలైనంత ఎక్కువమందిని తనిఖీ చేసేలా చూడాలని సూచించారు. పింఛన్‌దారుల అర్హతలను, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించడానికి మాత్రమే ప్రభుత్వం ఈ ప్రక్రియను చేపడుతోందని అర్హుల పింఛన్లు తొలగించే ఉద్దేశం ఎంతమాత్రం ప్రభుత్వానికి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ్ చక్రవర్తి, జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ, ఈపీఓ టి.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు, డీటీసీ డాక్టర్ కె.రాణి, ఆర్‌బీఎస్‌కే డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల పంటల ధ్వంసం

- ఏనుగులను తిప్పి పంపుతున్న ఒడిశా అధికారులు

భామిని: మండలంలోని వంశధార నదీ తీరంలో ఏనుగుల గుంపు విచ్చల విడిగా పంటలు ధ్వంసం చేస్తుంటే ఫారెస్టు అధికారులు చోద్యం చూస్తున్నారు. శుక్రవారం మండలంలోని పసుకుడి,భామిని గ్రామాలకు చెందిన కూరగాయల పంటలను నాలుగు ఏనుగుల గుంపు ధ్వంసం చేసింది. వంశధార నదీ తీరంలోని ఒడిశా గ్రామాలకు ఏనుగుల గుంపు వెళ్తున్నప్పటికీ ఒడిశా ఫారెస్టు అధికారులు గ్రామాల్లో విద్యుత్తును నిలిపివేసి ఏనుగుల గుంపును తిరిగి ఆంధ్రా గ్రామాలకు తరలిస్తున్నారు. దీంతో ఒడిశా గ్రామాల్లో ప్రవేశిస్తున్నప్పటికీ ఏనుగులను తిరిగి పంపిస్తున్నారని తీర ప్రాంత గ్రామ రైతులు వాపోతున్నారు.

నీతి అయోగ్ అభివృద్ధి పనులు వేగవంతం



నీతి ఆయోగ్ సంయుక్త కార్యదర్శి రాజీమన్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: నీతి ఆయోగ్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆశాఖ సంయుక్త కార్యదర్శి రాజీమన్‌కు సూచించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయానికి నీతి అయోగ్ సంయుక్త కార్యదర్శి కె.ఎస్. రాజీమన్ విచ్చేసి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలవగా కలెక్టర్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ ఆకాంక్ష జిల్లాగా పార్వతీపురం మన్యం జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రణాళికపై వివరంగా సంయుక్త కార్యదర్శితో కలెక్టర్ చర్చించారు. ఆకాంక్ష జిల్లాలో భాగంగా ఏర్పాటు చేయనున్న స్కిల్ హబ్ సెంటర్, గ్రామ విజ్ఞాన కేంద్రాల వివరాలను తెలియజేసి పనులు త్వరితగతిన పూర్తి కావాలని కోరారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹204

పోక్సో కేసులో ముద్దాయికి 25 ఏళ్ల జైలు

- ఎస్పీ వకుల్ జిందల్




సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని రామభద్రపురం పోలీస్‌స్టేషన్‌లో 2024లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు జన్నివలస పంచాయతీ, నేరెళ్ల వలస గ్రామానికి చెందిన 40 ఏళ్ల బోయిన ఎరుకన్న దొరకు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ వకుల్ జిందల్ ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఎస్పీ వెల్లడించిన కేసు వివరాలిలా ఉన్నాయి. 2024 జూలై 13న వరసకు కుమార్తె అయిన ఫిర్యాది ఇంట్లోకి వెళ్లి ఎరుకన్న దొర ఉయ్యాలలో ఉన్న ఆరు నెలల పసిపాపపై లైంగిక దాడికి పాల్పడినట్లు తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రామభద్రపురం పోలీసులు పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును అప్పటి బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు , రామభద్రపురం ఎస్సై జ్ఞానప్రసాద్ దర్యాప్తు చేసి, నిందితుడ్ని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసులో నిందితుడికి శిక్ష పడే విధంగా దర్యాప్తు చేయడంలోనూ, సాక్షులను ప్రవేశపెట్టడంలోనూ క్రియాశీలకంగా పనిచేసిన బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, అప్పటి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు, ప్రస్తుత బొబ్బిలి సీఐ కె.నారాయణరావు, ఎస్సైలు జ్ఞానప్రసాద్, వి.ప్రసాదరావు, హెచ్‌సీ వీఎల్‌వీ.నారాయణ, పీసీవై. అప్పలనాయుడు, ఏఎస్సై కె.పూడినాయుడు, సీఎంఎస్. హెచ్‌సీ సీహెచ్. రామకృష్ణలను ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.


తాటిపూటి అందాలు అదుర్స్

గంట్యాడ మండలంలోని తాటిపూడి పర్యాటక కేంద్రం ప్రకృతి అందాలతో ఆకట్టుకుంటోంది. రెండు కొండల నడుమ ప్రవహిస్తున్న తాటిపూడి నీరు పర్యాటకులను చూపుమరల్చకుండా చేస్తోంది. తాటిపూడి ప్రకృతి అందాలను వీక్షించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



రెండు కొండల మధ్య ప్రవహిస్తున్న తాటిపూడి నీరు







తాటిపూడిలో ఏర్పాటు చేసిన బోట్లు